

ఉద్యోగాల పేరిట టోకరా

టీడీపీ చోటా నాయకుడి కుమారుడు విదేశాల్లో ఉద్యోగాల పేరిట టోకరా వేశాడు. ఇప్పుడు అక్కడి పోలీసులకు చిక్కాడు. - 8లో



చింతామణి తల్లి సన్నిధిలో..

కవిటి: కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారిని సినీనటి కరాటే కల్యాణి శనివారం దర్శించుకున్నారు. ఉద్దానం ప్రాంతంతో తనకు చిన్ననాటి నుంచి సంబంధ బాంధవ్యాలు ఉండడంతో చింతామణి అమ్మవారిని దర్శనానికి వచ్చానని ఆమె తెలిపారు.



పలాసలో పీపుల్స్ స్టార్ సందడి

కాశీబుగ్గ: యూనివర్సిటీ చిత్ర ప్రచారంలో భాగంగా నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి శనివారం పలాసలో సందడి చేశారు. కాశీబుగ్గ హరిశంకర్ సినిమా థియేటర్‌కు విచ్చేసిన ఆయన రైలులో శ్రీకాకుళం బయల్దేరుతూ కూలీలతో ముచ్చటించారు.

న్యూస్‌రీల్

రేపటితో ముగియనున్న ఇంజినీరింగ్ ఆప్షన్ల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్–2023 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంజినీరింగ్ (ఎంపీసీ)స్ట్రీం ఆప్షన్ల ఎంపిక ఈనెల 14తో ముగియనుంది. ఈ ప్రక్రియ ఈ నెల 7న ప్రారంభమైంది. ఎంపికలో సమస్యలు ఉన్న వారు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రానికి వస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరిస్తున్నారు. ఆప్షన్ల ఎంపిక ముగిశాక, 16న ఆప్షన్ల మార్పులకు సాంకేతిక విద్యాశాఖ అవకాశం కల్పించింది. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలు, బ్రాంచ్‌లు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ర్యాంకు, రిజర్వేషన్, రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు లభిస్తాయి.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల బొల్లినేని మెడీస్కిల్స్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ ఆధ్వర్యంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఏదైనా డిగ్రీ లేదా పీజీ పాసై ఉండాలన్నారు. 20 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. నిర్ణీత రుసుంతో ఎంహెచ్ఏ, పీజీ డిప్లమా ఇన్ మెడికల్ రికార్డ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ టెక్నాలజీ కోర్సుల్లో ఏయూ, ఆర్ఏయూతో కలిసి అడ్మిషన్లు జరుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి: అధిక శ్రావణ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా అరసవల్లి ఆదిత్యుని కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ ఈ ప్రక్రియను జరిపించారు. రూ.500 చెల్లించిన భక్తులు కల్యాణ సేవలో పాల్గొని కల్యాణ తలంబ్రాలను, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర చెస్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో చౌదరి బాబ్జి, చెస్ సంఘ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా సాగిన రాష్ట్ర చెస్ పోరు ముగిసింది. ఏపీ రాష్ట్ర చెస్ అసోసియేషన్, సీఎస్ఎన్ ట్రస్ట్ సౌజన్యంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న ఇందిరా విజ్ఞాన్‌మందిరం వేదికగా మూడు రోజులపాటు హోరాహోరీగా జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి అండర్–11 బాలబాలికల చెస్ పోటీలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. బాలుర విభాగంలో విజేతగా శామ్యూల్ (అనంతపురం) నిలవగా, రన్నరప్‌గా యతిన్ రెడ్డి (తిరుపతి), మూడోస్థానంలో అఖిల్ ప్రసాద్ (వైజాగ్) నిలిచారు. ఇక బాలికల విభాగంలో రిషిత (కృష్ణ జిల్లా) విజేతగా, ఆముక్త (ప్రకాశం) రన్నరప్‌గా, త్రిపురాంబిక (తిరుపతి) తృతీయ స్థానంలో నిలిచింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ చౌదరి బాబ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు అక్టోబర్ ఒకటి నుంచి విశాఖపట్నం స్వర్ణ భారతి స్టేడియంలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని ఏపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు పేర్కొన్నారు.





పొలంబడిలో..

బాలికలు పొలం బాట పట్టారు. నాటు...నాటు నాటు అంటూ నాట్లు వేసే పనిలోకి దిగారు. పట్టణంలోని ఓ ప్రైవేటు విద్యాలయానికి చెందిన స్టూడెంట్లు ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ గ్రామానికి వెళ్లి అక్కడ జరుగుతున్న ఉభాలు పరిశీలించి పొలంలోకి దిగారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

చనిపోయినా బతికుందాం!

మట్టిలో కలిసిపోయే గుండె ఇంకో మనిషిని బతికించగలదు. మంటల్లో కాలిపోయే కళ్లు మరో బతుకులో వెలుగు నింపగలవు. ఆయువు తీరిన దేహం మరొకరి ఆయుష్షు రేఖను పెంచగలదు. ఇందుకు ఒకటే దారి.. అదే అవయవదానం. అంపశయ్యపై ఉన్న వారి తలరాత మార్చాలన్నా.. చావు అంచుల్లో నించున్న వారిని తిరిగి బతుకు దారిలోకి తీసుకురావాలన్నా ఇదొక్కటే మార్గం. **నేడు అవయవదాన దినోత్సవం.** చనిపోయాక శరీర భాగాలను వృధా చేయడం కంటే మరో మనిషి కోసం వినియోగించడం మాధవ సేవ అని చెప్పే రోజు. అపోహలు వీడి ఓ చైతన్య కాగడాను ఊరూరా వెలిగించాల్సిన తేదీ.





శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో శరీర అవయవదానం చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న దాతలు

- అవయవదానంపై అపోహలు వీడాలి
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

సండే స్పెషల్

ఇచ్ఛాపురం రూరల్: మనిషి చనిపోయాక దేహంతో పాటే అవయవాలన్నీ మట్టిలో కలిసిపోతాయి. లేదా చితిలో కాలి బూడిదవుతాయి. అవే అవయవాలను దానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో చిరునవ్వులు నింపవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు. బ్రెయిన్ డెడ్ కేసు అంటే మనిషి పూర్తిగా చనిపోయినట్లే లెక్క. సాధారణ మరణాల్లో నేత్రాలను తీసుకుంటారు.

నమోదు ఇలా

అవయవ దానం చేయాలనుకునే వారు ముందుగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తమకు తెలిసినవారందరికీ సమాచారం అందివ్వాలి. దీని వల్ల అతను చనిపోయాక అవయవ దానం చేసేందుకు వీలు కలుగుతుంది. జీవన్‌దాన్ అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం 2014లో ప్రవేశపెట్టగా, రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ కేంద్రంగా 2015 నుంచి తమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ పథకం ద్వారా బ్రెయిన్‌డెడ్ కేసుల నుంచి అవయవాలు సేకరిస్తారు. 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ జీవన్‌దాన్ డాట్ జీవోవి డాట్ ఇన్' వెబ్ సైట్‌లో డోనర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్నవారికి ప్రభుత్వం ఆర్గాన్ డోనార్ కార్డును అందజేస్తుంది.

అవయవాలు కావాల్సి వస్తే..

అవయవాలు కావాల్సిన రోగులు కూడా ప్రభుత్వ జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలి. వారికి సీరియల్ నంబర్ ఇస్తారు. అవయవ దానం చేసే కేసులు వచ్చినప్పుడు సీరియల్ నంబర్ ప్రకారం అవకాశం కల్పిస్తారు.

ఏయే అవయవాలు దానం చేయవచ్చు

మనిషి మరణానంతరం కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు దానం చేయవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి తలకు రక్త సరఫరా నిలిచిపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు.

సజీవమూర్తి కిరణ్‌చంద్



సోంపేట పట్టణం గీతా మందిరం కాలనీకి చెందిన మల్లారెడ్డి మోహన్, గిరిజా కల్యాణిల ఒక్కగానొక్క కుమారుడు కిరణ్‌చంద్(16) జిల్లా వాసుల్లో నింపిన స్ఫూర్తి అనన్యసామాన్యం. 2023 ఏప్రిల్ 15న పదో తరగతి ఆఖరి పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న కిరణ్‌చంద్ అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్రమైన తలనొప్పి, జ్వరంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయితే మెదడులో సమస్య వచ్చిందని, వెంటనే విశాఖపట్నం వెళ్లాలని వైద్యులు సూచించడంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి మార్చారు. వారం రోజుల అనంతరం పరిస్థితి విషమించడంతో వైద్యులు, ఆర్గాన్ డొనేషన్ సమన్వయకర్తలు తల్లిదండ్రులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. గుండె, కిడ్నీలు, లివర్, కళ్లను దానం చేసి మరికొందరి బతుకుల్లో వెలుగులు నింపారు.

8 మంది జీవితాల్లో 'చంద్ర'కాంతులు



జి.సిగడాం మండలం మధుపాం గ్రామానికి చెందిన పట్నాన చంద్రకళ(32) సీఏఫ్‌గా పనిచేసేవారు. ఈ ఏడాది మే 30న తలనొప్పితో బాధపడుతూ శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను విశాఖ విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చంద్రకళ తలలో నరాలు చిట్లిపోయి రక్తస్రావం అయినట్లు గుర్తించారు. దీంతో బ్రెయిన్‌డెడ్ అయిందని, ఈమె అవయవాలను ఇతరులకు దానం చేసి వారి జీవితాలకు నూతన వెలుగులు ప్రసాదించాలని వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించారు. భర్త శివను, ఇద్దరు కుమార్తెలను ఒప్పించడంతో జూన్ 1న అవయవదానం చేసి ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపారు.

ఇతరులకు ఉపయోగపడదాం



చనిపోయాక కూడా ఇతరుల జీవితాల్లో వెలుగు నింపి మరోసారి జీవించే అవకాశం అవయవదానం కల్పిస్తుంది. అవయవదానాన్ని మించిన దానం మరొకటి లేదు. అత్యవసర సమయాల్లో దాతలు లేక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. మరణించాక మన అవయవాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో మా దంపతులం శరీర అవయవదానం చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. – మిస్క కళావతి, కృష్ణయ్య , ప్రభుత్వ ఉపాధ్యాయులు

భర్త మాట కోసం



ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి పంచాయతీ అయ్యవారిపేటకు చెందిన కృష్ణచంద్రరౌళో ప్రైవేటు బస్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. 2015 మార్చి నెలలో ప్రమాదవశాత్తు వంతెన మెట్లపై నుంచి జారిపడటంతో కోమాలోకి వెళ్లిపోయాడు. బతికే సూచనలు లేవంటూ వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు హతాశులైపోయారు. విశాఖపట్నం న్యూకేర్ ఆస్పత్రిలో అవయవ దానం చేసేందుకు భార్య శారదా రౌళో అంగీకరించడంతో కళ్లు, గుండెతో పాటు కిడ్నీలను దానం చేశారు. ఆ అవయవాలు ముగ్గురికి కొత్త జీవితాన్ని ఇచ్చాయి. అందుకే ఆయన నేటికి సజీవంగా ఉన్నాడని విశ్వసిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

చంద్రబాబుది కపట ప్రేమ



- చంద్రబాబు హయాంలో అంతా దోపిడీ
- నేడు వైఎస్ జగన్ హయాంలో నిజాయితీగా పనులు
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అబద్ధాలకు ఒక హద్దు ఉండాలని చంద్రబాబుకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హితవు పలికారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన బాబు ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనను విమర్శించడం సమంజసం కాదన్నారు. ఆయన శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బీ వసతి గృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో చాలా ఏళ్లుగా కిడ్నీ వ్యాధి ఇబ్బంది పెడుతోందని, దీనిపై చంద్రబాబు ఏనాడూ స్పందించలేదని తెలిపారు. ఆ ప్రాంత ప్రజలకు మేలు చేయాలనే సీఎం వైఎస్ జగన్ రూ.700 కోట్లతో వంశధార తాగునీటిని ఉద్దానంకు తరలిస్తున్నారని వివరించారు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారన్నారు. కిడ్నీ రోగులకు నెలకు రూ.10 వేలు పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఉత్తరాంధ్రపై కపట ప్రేమను ఒలకబోస్తున్నారని,రాష్ట్ర విభజన తర్వాత ఒక్క సంస్థను కూడా శ్రీకాకుళంకు కేటాయించలేదని గుర్తు చేశారు. చంద్రబాబు మాయమాటలు అందరికీ తెలుసని అన్నారు. తోటపల్లి ప్రాజెక్టులో 90 శాతం పనులు వైఎస్సార్ హయాంలోనే జరిగాయని అన్నారు. వంశధార–బాహుదా అనుసంధానం పేరిట చంద్రబాబు దోపిడీ చేసేందుకు పన్నాగం పన్నారని, చంద్రబాబుకు అధికారం ఇస్తే దోపిడీనే చేస్తారని చెప్పారు. ఉత్తరాంధ్రలో చంద్రబాబు హయాంలో ఒక్క పనైనా చేశారా అని సూటిగా ప్రశ్నించారు.

తమ నాలుగేళ్ల పాలనలో అద్భుతాలు సృష్టించామని, పరిపాలన వికేంద్రీకరణతో సామాన్యులకు పౌర సేవలు సులువు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఊరూరా రోడ్లు నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే జరుగుతోందని, వాటితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించడం జరుగుతోందని, ప్రతి పనికీ జవాబుదారీ తనం ఉందని అన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ గౌరవ స్థానంలో ఉందని ఆయన తెలిపారు.

'హోంగార్డులకు 300 రెయిన్ కోట్లు'

శ్రీకాకుళం క్రైమ్: పోలీసులకు తన చారిటబుల్ ట్రస్టు ద్వారా డాక్టర్ దానేటి శ్రీధర్ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ జీఆర్ రాధిక కొనియాడారు. జిల్లాలోని హోంగార్డులకు ట్రస్టు తరపున 300 రెయిన్‌కోట్లను శనివారం ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవలే ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించి ఎన్నో సేవా కార్యక్రమాలు డాక్టర్ శ్రీధర్ చేస్తున్నారని, అదే విధంగా పోలీసు శాఖకు మీ వంతు సహకారం కావాలని కోరిన వెంటనే స్పందించి వర్షాకాలంలో ఉపయోగపడేలా 300 రెయిన్ కోట్స్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆర్థిక స్థోమత లేని హోంగార్డుల పిల్లలు చదువుల కోసం కూడా సాయం చేయడానికి ఆయన అందుబాటులో ఉంటారని చెప్పారు. డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ ఎస్పీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. హోంగార్డులకు తనవంతు సహకారంగా రెయిన్‌కోట్స్ అందించానని, ఇక నుంచి ఏటా రూ.20 లక్షల వరకు హోంగార్డు పిల్లల ఉన్నత చదువులకు కేటాయిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ఎస్.వాసుదేవ్ , వై.శృతి, డి.ప్రసాదరావు, ఆర్ఐ ఉమామహేశ్వరరావు, హోంగార్డులు పాల్గొన్నారు.



హోంగార్డులకు రెయిన్‌కోట్లు అందజేస్తున్న ఎస్పీ రాధిక, డాక్టర్ దానేటి శ్రీధర్

ముువ్వన్నెల వెన్నెల

స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఇంటింటా మూడు రంగుల జెండా రెపరెపలాడనుంది. అరసవల్లిలో శనివారం 'హర్ ఘర్ తిరంగ్–2.0'లో నిర్వహించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ (పోస్ట్సు) పర్యవేక్షకులు బి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సమక్షంలో జాతీయ జెండాల విక్రయాలను చేపట్టారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. – అరసవల్లి



క్లుప్తంగా

టీచర్ పోస్టు భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మందసలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న టీజీటీ ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో ఆర్డినేటర్ ఎస్.బాలాజీ నాయక్ తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూ, డెమో ద్వారా గెస్ట్ ఉపాధ్యాయుల ఎంపిక ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళంలోని ఆదివారంపేట, ఏపీఎస్‌డబ్ల్యూ, ఆర్‌ఈఐ సొసైటీ, జిల్లా కో–ఆర్డినేటర్ కార్యాలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 08942 279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అలరించిన సంపూర్ణ శతావధానం



అవధాన ప్రక్రియలో పాల్గొన్న కవిపండితులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న 'అవధాన పద్మాకరం–సంపూర్ణ శతావధానం' రెండో రోజు శనివారం జరిగిన ప్రక్రియ అలరించింది. ఈ సందర్భంగా పద్మాకర్ గాయత్రీ మాత, ఉగ్రనరసింహం, కుశాలపురం, సతివాడ, పోలమ్మ, సుమిత్రా కళాసమితి పై పద్యాలను చెప్పారు. మరో అవధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ సుమిత్రా కళాసమితి అద్భుతమైన అవధాన ప్రక్రియ చేపట్టడం అభినందనీయమన్నారు. మరో అవధాని తాతా సందీప్ శర్మ మాట్లాడుతూ అవధాన సాహిత్య ప్రక్రియ నిర్వహించి శ్రీకాకుళాన్ని అవధాన వేదికగా మార్చారని అభినందించారు. అవధాన ప్రక్రియ ఈరోజుతో ముగిసిందని నిర్వాహకులు డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ధర్నా



పూలే విగ్రహం ఆవరణలో ధర్నా చేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని ఫ్యాప్టో చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ వద్ద గల జ్యోతీరావు పూలే విగ్రహం ఆవరణలో మజ్జి మదన్ మోహన్ అధ్యక్షతన శనివారం జరిగిన 12 గంటల ఫ్యాప్టో ధర్నాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు.

విదేశీ విహంగం సురక్షితం



పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో సురక్షితంగా ఉన్న పెలికాన్ పక్షి

కాశీబుగ్గ: రెక్కకు దెబ్బ తగిలి పలాస ఆర్టీసీ డిపోలో పడిపోయిన విదేశీ విహంగం ప్రస్తుతం సురక్షితంగా ఉంది. పక్షికి ఆర్టీసీ సిబ్బంది అవసరమైన సపర్యలు చేస్తున్నట్లు మేనేజర్ ఆర్.సీ తారామనాయుడు తెలిపారు. అయితే ఫారెస్టు అధికారులు గానీ, తేలినీలాపురం పక్షుల కేంద్రం నుంచైనా ఇంతవరకు ఎవ్వరూ రాలేదని అన్నారు. ఆర్టీసీ డిపో ఆవరణలో ఉన్న చిన్న పాటి కొలనులో సేద తీరుతోందని చిన్నపాటి చేపలు వంటివి ఆహారంగా పెడుతున్నా తినడం లేదని తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,380–00
బంగారం(22కి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

విదేశాల్లో ఉద్యోగాల పేరిట టోకరా



బాధితులతో సీఐ, ఎస్‌లు సన్యాసినాయుడు, కామేశ్వరరావు



అజర్‌బైజాన్‌లో పోలీసులకు చిక్కిన ముద్దాడ కోదండ రామ్‌ప్రసాద్

- గార మండల టీడీపీ చోటా నాయకుని కుమారుడి నిర్వాకం
- నిరుద్యోగుల నుంచి రూ.70 లక్షలకు పైగా వసూలు
- 28 మందిని అజర్‌బైజాన్‌కు తీసుకెళ్లి మోసగించిన వైనం
- బాధితులు ఫిర్యాదు చేయడంతో రామ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన అజర్‌బైజాన్ పోలీసులు
- తన కుమారుడిని కిడ్నాప్ చేశారంటూ బాధితులపైనే ఫిర్యాదు చేసిన తండ్రి

శ్రీకాకుళం క్రైమ్, గార :

ఒకటా రెండా.. డబ్బై లక్షలు వసూలు చేశాడు. ఎక్కడో అజర్‌బైజాన్ దేశానికి తీసుకెళ్లి నిలువునా ముంచేశాడు. పాపం పండి.. అక్కడి పోలీసుల చేతికి చిక్కాడు. గార మండలం అంపోలు గ్రామానికి చెందిన ముద్దాడ వెంకట రామ్‌ప్రసాద్ చేసిన ఘన కార్యమిది. ఇండియా నుంచి అజర్‌బైజాన్ దేశం వరకు సాగిన ఈ కథ ఓ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. గార పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు..

గార మండలం అంపోలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముద్దాడ గుణేశ్వరరావు కుమారుడు ముద్దాడ కోదండ రామ్‌ప్రసాద్ టర్కీ సమీపంలోని అజర్‌బైజాన్‌లో గెట్ డైరెక్షన్ గ్లోబల్ యూనివర్సిటీలో పనిచేస్తున్నాడు. అక్కడే ఓ హాస్టల్ కూడా నడుపుతున్నాడు. విజయవాడలో ఓ ఫ్రాంఛైజీ కూడా పెట్టాడు. హైదరాబాద్‌కు చెందిన కొందరు ఓ ఏజెంట్ సాయంతో ఈ ఫ్రాంఛైజీ గురించి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న విజయవాడలోని ఫ్రాంఛైజీ ఏజెంట్‌ను కలిసి విదేశాల్లో ఉద్యోగాలు కావాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కొక్కరికీ యూనివర్సిటీ ఫీజు రూ. 1.25 లక్షలు, హాస్టల్ ఫీజు రూ. లక్ష మొత్తంగా రూ. 2.25 లక్షలు అవుతుందని చెప్పగా అంతా సిద్ధం చేసుకుని మొత్తం 29 మంది స్టూడెంట్ వీసాపై అజర్‌బైజాన్ వెళ్లారు. అక్కడ మార్చి 14న రామ్‌ప్రసాద్‌ను కలిసి డబ్బు చెల్లించారు. వీరికి పోలెండ్, జర్మనీ వంటి దేశాలకు పంపించి మార్కెటింగ్, లేబర్ వర్క్ విభాగాల్లో పనులు ఇప్పిస్తానని చెప్పాడు. అయితే ఎంత కాలమవుతున్నా ఉద్యోగాల ఊసు లేకపోవడంతో వారంతా రామ్ ప్రసాద్‌ను నిలదీయడం మొదలుపెట్టారు. గట్టిగా అడిగేసరికి అందరి వద్దా పాస్‌పోర్టులు లాక్కుని అతడు జెండా ఎత్తేశాడు. ఊహించని ఈ ఘటనతో షాక్‌కు గురైన బాధితులు రాజన్ మగర్ (హైదరాబాద్), సుంకరసాయి, ఉదయ్ (నిజామాబాద్), ముంబైకు చెందిన జాకబ్, అలెగ్జాండర్, పంజాబ్‌కు చెందిన కరంసింగ్, మనీందర్‌సింగ్‌లు అక్కడి పోలీసులను ఆశ్రయించారు. దీంతో విమానాశ్రయంలో పారిపోవడానికి ప్రయత్నిస్తున్న రామ్‌ప్రసాద్‌ను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. పాస్‌పోర్టులు బాధితులకు ఇప్పించడంతో వారంతా తిరిగి ఇండియాకు వచ్చారు.

మరో మలుపు..

రామ్‌ప్రసాద్ అరెస్టుతో కథ అయిపోలేదు. కుమారుడి ఘనకార్యం తెలుసుకున్న తండ్రి గుణేశ్వరరావు తన కొడుకును అజర్‌బైజాన్‌లో పైన పేర్కొన్న వారంతా కలిపి కిడ్నాప్ చేశారని, జూలై 19 నుంచి కాంటాక్ట్‌లో లేడని ఎస్పీ ద్వారా ఇంటర్‌పోల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ జీఆర్ రాధిక కేసును విచారణ చేయమని ఒకటో పట్టణ సీఐ సన్యాసినాయుడు, గార ఎస్ఐ ఎస్.కామేశ్వరరావులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు బాధితులను మూడు రోజుల కిందట గారకు పిలిపించారు. బాధితులు ఇక్కడకు వచ్చి అజర్‌బైజాన్‌లో జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్టు వివరించారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లు కూడా చూపించారు. అంతేకాకుండా అంపోలుకే చెందిన శేఖర్ తాను ఐపీఎస్ ఆఫీసర్‌నని, డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించినట్లు తెలిపారు. దీనిపై సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ రామ్ ప్రసాద్‌ను అజర్‌బైజాన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌లో ఉంచినట్లు బాధితులు ఆధారాలతో సహా చూపించారన్నారు. రామ్‌ప్రసాద్‌కు, అతని తండ్రి గుణేశ్వరరావుకు దఫ దఫాలుగా రూ. 20 నుంచి రూ.30 లక్షల వరకు ఇచ్చామని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. వీరిని బెదిరించిన శేఖర్‌పై కూడా కేసు నమోదు చేశామన్నారు.

మాకు చావే దిక్కు



రామ్‌ప్రసాద్ మాకు ఇతర దేశాల్లో ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి అక్కడికి తీసుకెళ్లి వదిలేసి పారిపోయాడు. పాస్‌పోర్టులు దాచేశాడు. అజర్‌బైజాన్‌లో యూనివర్సిటీ ఎండీ రాకేష్ సహాయంతో పోలీసు కేసు పెట్టాం. అక్కడి పోలీసులు ఎయిర్‌పోర్టులో పట్టుకుని అరెస్టు చేశారు. మా పాస్ పోర్టులు ఇప్పించారు. మాకు న్యాయం జరక్కపోతే చావే దిక్కు. మా చావుకు కారణం ముద్దాడ వెంకట గుణేశ్వరరావు అని రాసి చచ్చిపోతాం.

– షేక్ ఖరీముల్లా, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా

అక్కడ నరకం చూశాం



రూ. 1.25 లక్షలు యూనివర్సిటీ ఫీజు అని, హాస్టల్ చెఫ్‌గా పనిచేసిన నా నాలుగు నెలల శాలరీ రూ. 2 లక్షలు ఉంచేశాడు. మా పాస్‌పోర్టులు దాచేశాడు. తీరా కిడ్నాప్ కేసు పెట్టాడు.

– రాజన్ మగర్, హైదరాబాద్

రూ. 4.22 లక్షలు తీసుకున్నాడు..



నా వద్ద నగదు రూ. 1.95 లక్షలు, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ రూ. 2.27 లక్షలు తీసుకున్నాడు. యూనివర్సిటీ పేరుతో మోసం చేశాడు. ఎండీ రాకేష్ మాకు ఈ విషయంలో హెల్ప్ చేస్తున్నారు.

– కాసా కిరణ్‌కుమార్, మియాపూర్, హైదరాబాద్

మా ఇంట్లో తెలియదు..



ఇంత జరిగినా మా ఇంట్లో ఇంకా ఏమీ తెలియదు. నా వద్ద రూ. 2.25 లక్షలు నొక్కేశాడు. చాలా ఆశపడ్డాం.

– రామ్ సురేష్ మాచినేని, బెంగుళూరు

పేదల చదువులకు ప్రభుత్వమే అండ

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, తదితరులు

ఆమదాలవలస: పేదల చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆమదాలవలసలో నూతనంగా మంజూరైన మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పేదల చదువుల కోసం ఆలోచించే ఒకే ఒక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ఆయన అన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ విజ్ఞాన పోటీ ప్రపంచంలో పేద పిల్లలు కూడా రాణించాలని, అందుకే వారి కోసమే సీఎం వైఎస్ జగన్ విద్యకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. జగన్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరమన్నారు. ఆయన్ని ముఖ్యమంత్రిని చేస్తేనే ప్రస్తుతం సంక్షేమం కొనసాగుతుందన్నారు. ప్రతి ఇంటిలో విద్యావంతులు ఉంటే ఊళ్లు బాగుపడతాయని, ఆ దిశగానే సీఎం పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ స్త్రీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారని, మహిళా అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. చంద్రబాబు జిల్లాలో పర్యటించడం వృథా అని, ఆయన జిల్లాకు చేసిందేమీ లేదని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన అందిస్తోందన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరికీ సంక్షేమం అందజేస్తోందని తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఆర్డీఓ బి.శాంతి, మెప్మా పీడీ కిరణ్, బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ కృష్ణమోహన్, అధికారి అనూరాధ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీల హాస్టల్ వార్డెన్ రూల్స్ మార్చాలని సంబంధిత ప్రతినిధులు వినతి పత్రం అందించారు.

విదేశాలకు పార్సిళ్లు ఇక సులభం

- తపాలా కార్యాలయాల ద్వారా విదేశాలకు పార్సిల్ సౌకర్యం
- కేంద్రం విడుదల చేసిన తొలి జాబితాలో శ్రీకాకుళం, ప్రధాన తపాలా కార్యాలయానికి చోటు
- సెప్టెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం నుంచి విదేశాలకు పార్సిళ్లు పంపించే సదుపాయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పైలెట్ ప్రాజెక్టుగా దేశంలోని కొన్ని తపాలా కార్యాలయాల నుంచి విదేశాలకు పార్సిల్ పంపించే సౌకర్యాన్ని కల్పించింది. అక్కడ విజయవంతం కావడంతో తాజాగా దేశంలోని మరో 715 తపాలా కార్యాలయాలకు ఈ అవకాశం కల్పించారు. మన రాష్ట్రం నుంచి 24 పోస్టు కార్యాలయాలను ఎంపిక చేయగా అందులో శ్రీకాకుళం నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి అవకాశం లభించింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 8 నుంచి 10 శాతం మంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఏమైనా పంపించాలంటే ప్రైవేట్ కొరియర్ల ద్వారా వ్యయ ప్రయాసతో పార్సిళ్లు పంపించేవారు.

పోస్టు కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే తక్కువ ధరకే విదేశాలకు పార్సిల్ పంపించే అవకాశం ఉంటుంది. 715 తపాలా కార్యాలయాల్లో ఈ ప్రాజెక్టు విజయవంతం అయితే ప్రధాన పట్టణాలు, నగరాల్లోని అన్ని పోస్టాఫీసుల్లోను ఈ సౌలభ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వ యోచిస్తోంది.

క్వారీ ప్రమాదంలో ఆపరేటర్ మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన రమణమూర్తి



పొక్లెయినర్ క్యాబిన్‌పై పడిన గ్రానైట్ బ్లాక్

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధి నువ్వుగుడ్డి గ్రామ సమీపంలో గల వీఆర్‌పీ గ్రానైట్ క్వారీలో శనివారం జరిగిన ప్రమాదంలో క్వారీలో పొక్లెయినర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గంగు రమణమూర్తి(45) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం గంగుపేట గ్రామానికి చెందిన రమణమూర్తి శనివారం క్వారీలో రాక్ కటింగ్ చేసిన అనంతరం ఆ రాయిని బయటకు తీస్తుండగా రాయి పట్టుజారి ఒక్కసారిగా పొక్లెయినర్ క్యాబిన్‌పై పడింది. దీంతో రమణమూర్తి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అక్కడున్న వారు చాలాసేపు తీవ్రంగా శ్రమించి అతడిని బయటకు తీసి హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతని కాళ్లు నుజ్జునుజ్జైపోయాయి. చికిత్స చేస్తుండగానే అతడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి వచ్చి గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ రామకృష్ణ ముందుగా ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం క్వారీకి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతునికి భార్య సరళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. క్వారీల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని అందుకే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

స్వాతంత్య్ర వీరుల చరిత్ర భద్రపరచాలి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



స్వాతంత్య్రోద్యమంలో సిక్కోలు వీరులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జుత్తు తాతారావు తదితరులు

పలాస, కాశీబుగ్గ: స్వాతంత్య్ర సమర యోధుల చరిత్రను భద్రపరచాలని, అందుకు 'స్వాతంత్య్రోద్యమంలో సిక్కోలు వీరులు' పుస్తకం చాలా ఉపయోగపడుతుందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. రచయిత కుత్తుం వినోద్‌ను అభినందించారు. కాశీబుగ్గలోని ఓ లాడ్జిలో శనివారం ఈ పుస్తకాన్ని రాష్ట్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జుత్తు తాతారావు ఆవిష్కరించారు. కుత్తుం తాతారావు సాహిత్య సాంస్కృతిక కళాపీఠం గౌరవ అధ్యక్షులు హేమావతి అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి సీదిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి పుస్తకాలను గ్రంథాలయాల్లో పెట్టుకోవాలన్నారు. ఈ పంద్రాగస్టు నాడు జిల్లాకు చెందిన స్వాతంత్య్ర వీరులను స్మరించుకుని నివాళులర్పించాలని తెలిపారు. మన ప్రాంతంలో మొట్టమొదటి స్వాతంత్య్ర సమరయోధుడు పుల్లెల శ్యామసుందర శివాజీ అని, అతని పోరాట త్యాగాలను కొనియాడారు. పుస్తకావిష్కర్త జుత్తు తాతారావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన స్వాతంత్య్ర సమర యోధుల చరిత్రలను ఒక చోటకు చేర్చి పుస్తకం రూపంలో తేవడం చాలా కష్టంతో కూడిన పని అన్నారు. కుత్తుం వినోద్ దేశ సైనిక ఉద్యోగిగా రిటైరయ్యాక ఇలాంటి పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు.

బీఆర్ఏయూ ప్రొఫెసర్ జి.లీలావర ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా మన జిల్లాలో కూడా అనేక పోరాటాలు జరిగాయన్నారు. జమీందారీ వ్యతిరేక పోరాటాలు, రైతు రక్షణ యాత్రలు, కిషాన్ మహాసభలు, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలకు ఈ ప్రాంత నాయకులు నాయకత్వం వహించారని వివరించారు. ఈ పుస్తకాన్ని ఆయన సమీక్షించారు.

పట్టపగలే ఇంటిలో చోరీ



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఒక ఇంటిలో శనివారం పట్ట పగలే చోరీ జరిగింది. పట్టణంలోని వసంతం వీధిలో నివాసం ఉంటున్న పిలక శివప్రసాద్ ఇంటిలో దొంగలు జొరబడి రూ.2,40,000లు చోరీ చేశారని ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. ఇంటి యజమాని మార్కెట్‌కు వెళ్లిన సమయం చూసి దుండగులు ఇంటి వెనుక నుంచి ప్రవేశించి బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డు తాళాలు పగులగొట్టి డబ్బులు దోచుకున్నారని పేర్కొన్నారు. శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

అనుమతులు లేని విద్యాలయాలపై క్రిమినల్ కేసులు

- ఆర్ఐఓకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం



కేసరి అప్పారావు, బాలల హక్కుల సంరక్షణ కమిటీ చైర్మన్



అనుమతి లేకుండా నిర్వహిస్తున్న నారాయణ కళాశాల

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. కొద్ది రోజుల కిందట బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావుకు ఓ విద్యార్థి తల్లిదండ్రులు నారాయణ విద్యా సంస్థలు తమ కుమారుడికి టీసీ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన సంబంధిత సంస్థ ప్రతినిధికి ఫోన్ చేసి మాట్లాడగా.. వారు పట్టించుకోలేదు. శుక్రవారం మరోసారి ఫోన్ చేస్తే పరుష పదజాలంతో దూషించారు. దీంతో ఆయన కమిషన్ సభ్యులతో కలిసి శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న నారాయణ విద్యా సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలకు అనుమతి లేకపోయినా కోచింగ్ సెంటర్ పేరిట రెగ్యులర్ తర గతులు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఉండడాన్ని కమిషన్ తప్పు పట్టింది. మౌలిక వసతులు కూడా లేకపోవడాన్ని కమిషన్ సభ్యులు గమనించారు. ఆగస్టు నెలాఖరులోగా అనుమతి పొందాలని, లేదంటే చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ, డీఈఓలను ఆదేశించారు.

ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ప్రభుత్వ, బోర్డు నిబంధనలు పాటించపోయినా, అనుమతులు లేకపోయినా అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. విద్యా సంస్థ ప్రతినిధి మమ్మల్ని పరుష పదజాలంతో దూషించటం వాస్తవమే. మా ఆదేశాలను కూడా నారాయణ విద్యా సంస్థల ప్రతినిధి ధిక్కరించారు. మా పరిస్థితే ఇలా ఉంటే.. సాధారణ తల్లిదండ్రుల పరిస్థితి ఊహించుకోవచ్చు.

– కేసరి అప్పారావు, బాలల హక్కుల సంరక్షణ కమిటీ చైర్మన్

వాహనాల దొంగల ముఠా పట్టివేత



దొంగిలించిన బైక్‌లను చూపిస్తున్న ఎస్ఐ ఎం.గోవింద, హెచ్‌సీ ధర్మారావు, సిబ్బంది

కొత్తూరు: వాహన దొంగల ముఠాను కొత్తూరు ఎస్ఐ ఎం.గోవింద తన సిబ్బందితో శనివారం పట్టుకున్నారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో ఆయన తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో కొత్తూరు మండలం గురండి గ్రామానికి చెందిన అలికాన వంశీ, పాగోటి వినయ్, ఒక మైనర్ బాలుడులు వాహనంతో దొరికారు. వీరు తీరు అనుమానాస్పదంగా ఉండడంతో వీరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. వాహనాలు దొంగిలించినట్లు ఒప్పుకుని వివరాలన్నీ చెప్పేశారు. ఒడిశా రాష్ట్రం కిడిగాం, సీతాపురంతో పాటు పలు గ్రామాల్లో మూడు బైక్‌లు, ఒక లగేజి ఆటో, సర్వీస్ ఆటోలు దొంగలించినట్లు చెప్పారు. అలాగే హిరమండలం మండలంలో 3, జలుమూరు మండలంలో 1, భామిని మండలం బత్తిలి గ్రామంలో ఒకటి, కొత్తూరు మండలం సోమరాజపురంలో 1 చొప్పున బైక్‌లు దొంగలించినట్లు చెప్పారు. ఆ వాహనాలను విక్రయించిన వారి వివరాలు చెప్పడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి వాటిని ఆరు గంటల్లోనే రికవరీ చేశారు. ముఠా దొంగిలించిన రెండు ఆటోలు, ఒక బులెట్, 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ1 ముద్దాయిగా ఉన్న అలికాన వంశీ మండలంలోని మెట్టూరు సెంటర్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఏ2 పాగోటి వినయ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు, మైనర్ బాలుడు మెట్టూరులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురూ ఒక గుంపుగా ఏర్పడి వారికి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో బైక్‌ల తాళాలు తీసి దొంగలిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. దొంగిలించిన బైక్‌లను ఓఎల్ఎక్స్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. బైక్‌ల స్టిక్కరింగ్‌లు మార్చడం, సీట్ కవర్లు మార్చి బైక్ రూపాన్ని మార్చేస్తున్నారని వివరించారు.